

నిరసన సభలో మాట్లాడుతున్న కేటీఆర్, వేదికపై ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పాడి కౌశిక్‌రెడ్డి, సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, బాల్క సుమన్, చిన్నయ్య, ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన నిరసన సభకు తరలివచ్చిన అశేషజనం, రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన నిరసన సభకు తరలివచ్చిన అశేషజనవాహిని



జై కేసీఆర్.. జైజై కేటీఆర్.. జై జై జై తెలంగాణ నినాదాలు చేస్తున్న వృద్ధ మహిళ , రైతు

# ఆదిలాబాద్ నిరసన సభ కొట్లాటకు తోవచూపింది..

## రైతు, ప్రజా సమస్యలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆందోళనలు

- ఆదిలాబాద్ సీసీఐ, దేవాపూర్ సిమెంటు పరిశ్రమ, సింగరేణిపై అదానీ కన్ను
- రుణమాఫీ అడిగితే కేసులా? హామీలు అమలు చేయని లుచ్చాలపై కేసులు పెట్టాలి..
- కేసులకు భయపడేది లేదు.. ప్రజల కోసం జైలుకుపోతాం..
- ఆదిలాబాద్ రైతు నిరసన సభలో గర్జించిన యువనేత కేటీఆర్

ఆదిలాబాద్, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన రైతు నిరసన సభ రాష్ట్రంలోని రైతు, ప్రజా సమస్యలపై కొట్లాడడానికి తోవ చూపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన సభకు యువనేత కేటీఆర్ హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో ఆదిలాబాద్ జిల్లా అగ్రభాగాన నిలిచిందని, భోరజ్ చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన సడక్‌రోకో కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి తాను హాజరైనట్లు వివరించారు. కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగలని, రాష్ట్రంలోని పరిశ్రమలను అదానీకి కట్టబెట్టాలని చూస్తున్నాయని మండిపడ్డారు. నల్గొండ జిల్లా రామన్నపేటలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ర్యాలీ తీసి కాలుష్య పరిశ్రమను వ్యతిరేకించినట్లు తెలిపారు. ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ, బెల్లంపల్లిలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ, సింగరేణిపై అదానీ కన్ను పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గులాబీ కండువా గట్టిగలేకపోతే కాంగ్రెస్, బీజేపీ మోసం చేస్తాయని పేర్కొన్నారు. ఆదిలాబాద్ సీసీఐని ప్రారంభిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారని, గతంలో గెలిచిన ఎంపీతోపాటు ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యేలు సీసీఐ పేరు చెప్పి గెలిచిన తర్వాత మాట మార్చారన్నారు.

### ఉమ్మడి జిల్లావ్యాపంగా ఆందోళనలు

రైతు సమస్యలపై ఆదిలాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన విధంగా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి జోగు రామన్న రైతులు, ప్రజా సమస్యలపై ఇలా మాట్లాడడం తాను ఇప్పటివరకు చూడలేదన్నారు. ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే)లో రైతులు, ప్రజలు తమకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. హామీలు అమలు చేయాలని కోరుతూ రాహుల్‌గాంధీకి ఉత్తరాలు రాశారన్నారు. నవంబరులో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయని, జిల్లా ప్రజలు అక్కడ ఉన్న తమ బంధువులకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను తెలియజేయాలని కోరారు.

### రైతులు, పేదలపై కేసులా?

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ కోసం తలమడుగు మండలంలోని రుయ్యాడిలో ఆందోళన చేసిన రైతులపై కేసులు పెడితే హామీలు అమలు చేయని లుచ్చాలపై కూడా కేసులు పెట్టి జైలుకు పంపాలని యువనేత కేటీఆర్ డిమాండ్ చేశారు. హైడ్రా తరహాలో ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌లో ఇండ్లను కూలగొట్టడానికి అధికారులు పోతే కడుపుమంటతో మాట్లాడిన బొడిగం గంగన్న అనే వృద్ధునిపై కేసు పెట్టారని తెలిపారు. ప్రజలు తమకు కొట్లాడే శక్తిని ఇవ్వాలని ప్రజా సమస్యల కోసం తాము జైలుకు పోవడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ఆదిలాబాద్‌లో రైతులు పండించిన పత్తికి సీసీఐ ద్వారా కొనుగోలు చేసి గుజరాత్ ఇస్తున్న ధర క్వింటాలుకు రూ.8,800 చెల్లించాలని డిమాండ్ చేశారు. పత్తికి ఆ ధర చెల్లించేలా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పంట కొనుగోలు కేంద్రాలకు పోయి అధికారులను నిలదీయాలని సూచించారు. పత్తి కొనుగోలు విషయంలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కొట్లాడలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, సంజయ్, కౌశిక్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, యూనిస్ అక్బానీ, సాజిదొద్దీన్, రోకండ్ల రమేశ్, నర్సింగరావు, విజ్జిగిరి నారాయణ, అజయ్, లింగారెడ్డి పాల్గొన్నారు.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



### ❖ మళ్లీ కేసీఆర్ వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది..

*తాంసి, అక్టోబర్ 24 ః కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేస్తానని రాష్ట్ర ప్రజలను మోసం చేసింది. ఇప్పటి వరకు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వలేదు. పింఛన్‌దారులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు ఇస్తానని ఇవ్వడం లేదు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 అమలు కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలతో ప్రజలు, రైతులను మోసం చేసింది. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే రాష్ట్ర ప్రజలు సుఖంగా సంతోషంగా ఉంటారు.*

**- కోవ లక్ష్మి, ఎమ్మెల్యే, ఆసిఫాబాద్**

## ఏఈవోల సస్పెన్షన్ ఎత్తివేతలో గందరగోళం

మంచిర్యాల (ఏసీసీ), అక్టోబర్ 24 : వ్యవసాయ విస్తరణ అధికారుల సస్పెన్షన్‌లపై గందరగోళం నెలకొంది. సస్పెన్షన్ ఎత్తివేసినట్లు ఇప్పటికే ప్రచారం కాగా, దానికి సంబంధించిన ఉత్తర్వులు ఇంకా వెలువడలేదని గురువారం జిల్లా వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించిన 'నమస్తే' ప్రతినిధికి అధికారులు తెలిపారు. రైతుబీమా పథకంలో ఉదాసీనంగా వ్యవహరించినందుకుగాను జిల్లాలో ఐదుగురు ఏఈవోలపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. రైతు బీమా పథకం పెండింగ్ పనులను యుద్ధప్రతిపాదకన పూర్తి చేయడంతోపాటు డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను వాడుతామని ఏఈవోలు పేర్కొనడంతో వారిపై దాదాపు సస్పెన్షన్ ఎత్తివేసేందుకు వ్యవసాయ శాఖ సుముఖంగానే ఉంది. మరోవైపు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఈవోల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. దాదాపు ఎనిమిది నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. వ్యవసాయ శాఖ కమిషనర్ నుంచి నిధుల విడుదల లేక పోవడంతో సంబంధిత ఏజెన్సీలు ఏఈవోలకు వేతనాలు చెల్లించడంలో ఆలస్యమవుతోంది. ప్రభుత్వం దృష్టి సారించి వేతన బకాయిలు ఇప్పించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

### ఏఈవోలను సస్పెన్షన్ చేయలేదు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబరు 24 (నమస్తే తెలంగాణ) : జిల్లా వ్యవసాయశాఖ పరిధిలో ఔట్ సోర్సింగ్‌పై పని చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులెవ్వరినీ సస్పెన్షన్ చేయలేదని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఔట్‌సోర్సింగ్‌పై పని చేస్తున్న 21 మంది ఏఈవోలను సస్పెన్షన్ చేసినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఆయన కోరారు.

## మున్సిపల్ ఏఈపై కౌన్సిలర్ అనుచిత వ్యాఖ్యలు

- విధులు బహిష్కరించి నిరసన తెలిపిన సిబ్బంది
- ఏసీపీకి ఫిర్యాదు

బెల్లంపల్లి, అక్టోబర్ 24 : మున్సిపాలిటీలోని 22వ వార్డు కౌన్సిలర్ గడ్డం అశోక్ గౌడ్ ఏఈ సందీప్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం కమిషనర్ శ్రీనివాసరావుతో పాటు అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించారు. ర్యాలీగా వెళ్లి ఏసీపీ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కౌన్సిలర్ అశోక్‌గౌడ్ ప్రభుత్వ అధికారులను మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. వాట్సాప్ గ్రూప్‌లలో కౌన్సిలర్ అవమానపరిచే విధంగా మెసేజ్ పెట్టడం వల్లే మానసిక క్షోభకు గురై ఏసీపీకి ఫిర్యాదు చేసినట్లు ఏఈ సందీప్ తెలిపారు. డీఈ ప్రసాద్, టీవో అశ్రిత్,ఆర్వో ప్రవీణ్,సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు

## పోలీసులతో వెట్టి చాకిరి చేయిస్తారా..?

- కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యుల ఆగ్రహం
- గుడిపేట 13వ బెటాలియన్ ముందు ధర్నా
- ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్
- కమాండెంట్ హామీతో ఆందోళన విరమణ

హాజీపూర్, అక్టోబర్ 24 : 'పోలీసులా.. లేక కూలీలా.. వాళ్లతో వెట్టిచాకిరి చేయిస్తారా..' అంటూ గురువారం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ ముందు జాతీయ రహదారి-63పై పలువురు కానిస్టేబుళ్ల భార్యలు తమ పిల్లలతో కలిసి ధర్నాకు దిగారు. బెటాలియన్ పై స్థాయి అధికారులకు సేవలు చేయించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీజీ ఎస్పీ డౌన్ డౌన్.. అంటూ నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ సంఘ విద్రోహ శక్తులను కట్టడి చేసి.. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పోలీసు ఉద్యోగంలో చేరిన వారితో కూలీ పనులు చేయించడమేమిటని మండిపడ్డారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల మాదిరి విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని, తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో ఆకస్మిక బదిలీలు లేకుండా ఐదేళ్లపాటు ఒకే దగ్గర పనిచేసేలా పోస్టింగ్‌లు ఇవ్వాలని, సివిల్, ఏఆర్ పోలీసుల మాదిరిగా బెటాలియన్ పోలీసులకు విధులు కల్పించాలని డిమాండ్ చేశారు. హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ అక్కడికి చేరుకొని వారిని సముదాయించి ధర్నా విరమింప జేశారు. అనంతరం అక్కడి నుంచి బెటాలియన్ గేట్ ముందుకు చేరుకొని బైఠాయించారు. కమాండెంట్ వెంకట్రాములు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.



రాస్తారోకో చేస్తున్న పోలీసుల కుటుంబ సభ్యులు

## అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- మంచిర్యాల డీసీపీ భాస్కర్‌రావు
- ఎస్టీపీపీలో మెగా రక్తదాన శిబిరం

జైపూర్, అక్టోబర్ 24 : పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని మంచిర్యాల డీసీపీ భాస్కర్‌రావు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం జైపూర్ సింగరేణి విద్యుత్‌కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ జవాన్లతో పాటు పోలీసులు, ఎస్టీపీపీలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, యువత తదితరులు కలిసి సుమారు 250 మంది రక్తదానం చేశారు. డీసీపీ నిర్వాహకులు, రక్తదాతలను అభినందించారు. డీసీపీ మాట్లాడుతూ 1996లో ఊట్నూర్ పోలీస్‌స్టేషన్‌పై దాడి ఘటనలో 18 మంది మృతిచెందారని, అందులో ఒకరైన కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి భార్య వనజారెడ్డి అని, ఆమె ప్రస్తుతం జైపూర్ తహశీల్దార్‌గా పని చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం రాజశేఖర్, జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వైద్యులు అనిల్ రావు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు చందూరి మహేందర్, వైద్యులు ముస్తఫా, శ్రావ్య, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐలు శ్రీధర్, శ్వేత, సంతోష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జైపూర్ ఎస్టీపీపీలో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీసీపీ వెంకట్‌రెడ్డి

## మళ్లీ ఏనుగు భయం..

పెంచికల్ పేట్, అక్టోబర్ 24 : ఏప్రిల్‌లో ఓ ఏనుగు ఇద్దరి రైతులను హతమార్చిన విషయం మర్చిపోకముందే.. మళ్లీ మహారాష్ట్ర సరిహద్దు గడ్చిరోలిలో సంచరిస్తున్నట్లు తెలియగా, జిల్లా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఏనుగు కదలికలపై మహారాష్ట్ర అధికారులు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రాణహిత సరిహద్దు రేంజ్ పరిధి అధికారులకు సమాచారం అందించినట్లు తెలుస్తున్నది. దీంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతున్నది. సరిహద్దులు దాటకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో అనిల్ కుమార్‌ను వివరణ కోరగా.. మహారాష్ట్ర అధికారులు ఏనుగు కదలికలపై సమాచారం అందించిన విషయం వాస్తవమేనని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలో గ్రామాల్లో జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

## మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో అలర్ట్

మంచిర్యాల అర్బన్/కోటపల్లి, అక్టోబర్ 24 : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుశాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు గురువారం గడ్చిరోలి ఎస్పీ కార్యాలయంలో డిప్యూటీ ఐజీ అంకిత్ గోయల్ మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. మహారాష్ట్ర ఎన్నికల దృష్ట్యా మావోయిస్టు కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మూడు రాష్ట్రాల పోలీస్ అధికారులు ఒకరినొకరు సహకరించుకోవాలన్నారు.కాగా, మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నిర్వహించిన మూడు రాష్ట్రాల పోలీస్ అధికారుల సమావేశానికి సీపీ హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ఆసిఫాబాద్, భూపాలపల్లి జిల్లాల ఎస్పీలు, మంచిర్యాల డీసీపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ పోలీసులు పాల్గొన్నారు.

## మత్తడి పేల్చివేత కేసులో మరొకరి అరెస్టు

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 24 : పట్టణంలోని శనిగకుంట మత్తడి పేల్చివేత కేసులో మందమర్రికి చెందిన మేదరి సతీశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ రవీందర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మత్తడి పేల్చివేత కేసులో ఇప్పటి వరకు 14 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. జిలెటిన్ స్టిక్స్‌ను మంచిర్యాలకు చెందిన బాలాజీ షాప్‌నకు చెందిన వారు సరఫరా చేసినట్లు తెలిపారు. జిలెటిన్ స్టిక్స్ సరఫరా చేసిన సతీశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. వీరికి సహకరించిన మరో నిందితుడు, షాప్ యజమాని నితీశ్ బిర్లా పరారీలో ఉన్నట్లు తెలిపారు. మత్తడి పేల్చివేత కోసం 25 జిలెటిన్ స్టిక్స్ సరఫరా చేయగా, అందులో శనిగకుంట బ్లాస్టింగ్‌కు 21 వినియోగించారని, మిగిలిన నాలిగింటిని దానయ్య వద్ద స్వాధీనం చేసుకున్నామన్నారు.